## చిన్న కథ

# మత్తానయ్య మరణం

రాంషా

ఆ వేళ సాయంత్రం అందరూ సకాలానికి చేరుకున్నారు. పగల్లా పెంకులెగరగొట్టిన గాడ్పులు సాయంత్రానికి వడగాలిగా తిరిగేయి. 'ఈ ఎండలో ఏమౌతాం?' అనే ప్రశ్నయే కలగలేదెవళ్ళకీ.

అంతా సమావేశమయ్యారు – వీరారెడ్డి, రామిరెడ్డి, సుభాన్, యల్లమంద, కమల– అంతా సమావేశమయ్యారు. కమల – అంతగా పెద్ద కవి గాకపోయినా – కరపత్రాలు, నినాదాలు వ్రాయటంలో, ఆంధ్రమహాసభ పోరాట సమాచారాన్ని ప్రచారం చేయటంలో నిమగ్నమై పోయింది. అచ్చుపనంతా ఆమెది. గెరిల్లాల శిక్షణ రామిరెడ్డి, సుభాన్‌లది.

అంతా సభచేరి అలాగే మౌనంగా కూర్చున్నారు. కొన్ని నిముషాలలాగే గడిచిపోయాయి ఉబ్బెత్తుగా తృళ్ళిపడి లేచాడు యల్లమంద.

"మేకమయిందీ, మేకయిందీ ఇప్పుడే తేల్చేయాలనుకొంటున్నాను; ఓయ్..." అన్నాడు యల్లమంద, తన తలపాగా, చంకనున్న కంబళీ, క్రింద పెడుతూ. అతను కళ్ళు మెదిపినరీతి, పిలక ఆడించినరూ–మరొక్కమాటైనా అతన్ని విననీయనంత ఆనందాన్ని కలిగించింది మిగతా సభ్యుల్లో.

'అయ్యో. నోర్లెల్లబెడతవేం రామిరెడ్డీ, సెప్పేదినక... ఆడి దుంపతె, ఆ కుక్కల నా కొడుకు మత్తానయ్య ఉండాడే – ఆడి పని పట్టాలింక!... దొరికిన్నాడే ముండా కొడుక్కును నా కెత్తనయ్యా అంటే చీనివాచరావుగారు 'అహింసో' అన్నారు... ఆడిప్పుడు ఏకు మేకై కూకున్నాడు." అన్నాడు యల్లమంద.

'ఇంకా నీ దేవరపోతుగోల వదల్లేదేమే, యల్లమందా!' అన్నాడు రామిరెడ్డి నవ్వుతూ.

యల్లమంద అగ్నిపర్వతంలా పెటిల్లుమన్నాడు.

'ఏంటో, నువ్వు సెప్తుంటి! ఆ యెదవనాయాలు ఊరూరందర్నీ దేవరపోతునే సత్తావుంటుంటే, మీకేమీ సీమ కుట్టలేదుగాని, నా దేవరపోతుకోసం ఏడుత్తున్నానంటు!... ఏం మడిసో సూడమ్మో కమలమ్మా! యేలాకోలానికేనా యేళాపాళా వుండాల... ఆయాల దొంగనా కొడుకుని లాక్కొచ్చి కొంకులు తెగయ్యండర్రా అంటే చీనివాచరావుగారు వొద్దన్నారంట: అందుచేత వదిలిపెట్టేసినంట!.. అందుకే మెరేగిపోతన్నాడు యదవనాయాల! ఆ రజాకారుల్లో సేరి

కనిబట్టాడంటే బట్టడూ?...అయినా ఈరా రెడ్డి మాకు కేంలే - పోతే ఊరేపోద్ది"

'హారే. అదేమిటి యల్లమందా! అల్లా అంటావ్? హాస్యానికికూడా అంత కోపమా? హాసికాలకి వేళకాదని తెలీక అన్నాడు రామిరెడ్డి దానికిలా అనేస్తావా?...మరెవరికోసానికంటున్, మనమంతా సీతమ్మతల్లినీ, దాదాని పోగొట్టుకొంటు?" అన్నాడు సుభాన్.

'సరేనయ్యా, నాదే తప్పంటీనిగా... చమించండి. ఏమైనాగాని ఆ మస్తానయ్య నెత్తురు కళ్ళజూడందే నాను నిద్రబట్టదను కోండి...ఇంకా ఎంతమందిని పొట్టపెట్టుకుందామనుకుంటున్నాడో ... తెలంగాణా సీతమ్మలమీదా, తెలంగాణా దాదాల మీద పెమాణంచేసి చెప్తున్నా. ఆ నంజకొడుకుని పేణాలు తియ్యందే తిరిగి రాను. 'ఊఁ' అనండి సాలు. నేనెల్లాగైనా సంపకమాన్ను."

అందరూ ఆలోచనలో పడ్డారు. ఇంక ఏమైనా మస్తానను యల్లమంద సంపక మానడు.

* * *

మస్తాన్...

ఎక్కడికి వెళ్ళినా, తన కళేబరాన్నింకా అంటిపెట్టుకున్న కాళ్లు, చేతులూ ఎలా కదులుతున్నా, జగన్నాధరెడ్డి నల్లగొండ పారిపోయినప్పట్నుంచీ, తన్ను గొల్లయల్లమందాయిగాడు పట్టుకొని సంఘం వోళ్ళకి అప్పజెప్పినప్పట్నుంచి తన నవాబ్ టోపీకి అవమానం జరిగినట్టే, తన ఎర్రని మిడిగుడ్లకు అధికారం తగ్గినట్లే, తన చేతిలోని కంచీకి ఉద్యోగం ఊడిపోయినట్టే భావించాడు. ఆవేళ శ్రీనివాసరావుగారే క్షమించాను పొమ్మనకపోతే తనప్రాణాలు ఆ గొల్లయెల్లమందాయిగాడి చేతుల్లో పోయి ఉండేవే.

ఒక కాఫీర్ ముండాకొడుకు తన్ని క్షమించడం! ఒక గొల్ల యల్లమందాయిగాడా తన్ని ఉరితీస్తాననడం!! కాలం మారిపోయింది. మస్తానయ్యదృష్టిలో.

గ్రామమంతా కట్టుగట్టి ఏకమై ప్రతిఘటిస్తూవున్నా, తను కూడా ఈ సంఘం నాయకుల్ని అవకాశం చూసుకు మట్టుపెట్టాలని ప్రయత్నిస్తూవున్నా, నిజానికి మస్తానయ్య చచ్చిపోయినవాళ్ళల్లో నేజమ.

ఎంతైనా దేశముఖు జగన్నాధరెడ్డికి తనమీద అభిమానం పోలా. తన ప్రాణాల కోసం పారిపోయినా వెంబడే వందమంది రజాకార్లని పంపిచ్చాడు తనకోసం.

రజాకార్ల నియామానికి పహారా కాస్తూవున్నా, నాయకులకోసం ఉచ్చులు వేస్తూవున్నా అతన్ని కసి తరుముతూనే వుంది. పోగులమ్మి పీకనులిమి ఒంటిమీద నగలన్నీ తానూ, పెళ్ళామూ ఒల్చుకుంటూవుంటే కసి కిటికీలోంచి తొంగి చూచింది. రాత్రింబవళ్ళు నీడలా తరుము కొస్తోంది తను చేస్తూన్న పాపాలన్నీ కళ్ళారా చూస్తూ, జాబితాలు తయారు చేస్తోంది. చీకట్లోకూడా పిల్లికళ్ళతో కని పెడుతోంది కసి. మస్తానయ్య ఈ సంగతే కనిపెట్టి వుంటే తన పంచప్రాణాలన్నీ బిగబట్టి ఉండేవాడు.

ఇప్పటికే మస్తాన్ మృతతుల్యుడుగా తయారయ్యాడు. అతనేపనిచేసినా, ఎట్లాంటిపనుల్ని నిర్వహించినా అతను మనస్ఫూర్తిగా చేస్తున్నవి కావు. అతని కీకనిండావున్న అత్యాశగాని యజ్ఞమం దాదులపై తీసుకోవలసిన ప్రతికక్షాదాహం కాని కారణంకాదు. తన మూఢమత నమ్మకాలను దోపిడీచేసి, తమ దౌర్జన్యానికి సాధనగా ఇతన్ని కలుపుకొని, వారి నిర్బంధంలో నడిపించటమే రజాకార్లు ఇతనిపై సాధించుకొన్న విజయం.

అతనిలో ఇప్పుడున్నది ప్రతీకార వాంఛ—ఒక ప్రత్యేకలక్ష్యంలేదు మళ్ళీ-కేవల ప్రతీకారవాంఛ, తనజీవితంమీద ప్రతీవాడిమీదా, చివరకు రజాకార్లమీదా అందంమీదా అతనికున్నదిఒకే ప్రతీకారవాంఛ.

ఈప్రతీకారవాంఛయే మస్తాన్ ఆత్మను సర్వశూన్యంచేసి నిస్పృహలో కాల్చివేస్తోంది. అయినా ఇంత క్రూరంగా ఇంతఘోరంగా ఇదివరకెప్పుడూ—దేశముఖు జగన్నాథరెడ్డి హయాంలోకూడా – తాను ప్రవర్తించి వుండలేదని అతనికి తెలుసు. అతని నైతికబలం పారిపోయింది; పాపం, నీచుడైనా ఆ పట్వారీ వెంకట్రావు తన చర్యల్ని సమర్థిస్తూ తన మనస్సుకుబలాన్ని కలిగించేవాడు. ఆ ఒక్కణ్ణి ఈ గొరిల్లాలు పొట్టపెట్టుకున్నారు. కాంగ్రెస్‌లో చేరి కేశవరావుగారి శరణుజొచ్చినా దిక్కు లేకపోయింది. ఆ హరిగాడు వెనకపోటు పొడిచాడు వెంకట్రావుగార్ని, కాంతారావుగార్ని. మొత్తంమీద అతని నైతిక బలం దిగజారిపోయింది. తనకున్న ఒక్క ఆధరవూ నేల రాలిపోయింది.

ఇంక దేశముఖు జగన్నాథరెడ్డి తనకు సహాయంగా పంపించిన రజాకార్లపై తానే నాయకత్వం వహించి, తన అధికారాన్ని విస్తృతం చేస్తూ విసునూరును ఏకచ్ఛత్రాధిపతిగా పాలిద్దామనుకున్నాడు. స్మశానమైన కొంపలు ... మానభంగాలైన అతివలు... శిరస్సులు తెగిన మనుష్యులు.. ఎంత భీభత్సం!!! తను రజాకార్లపై అధికారాన్ని సంపాదించగలగటంపోయి, వాళ్ల చేతుల్లో బానిస అయ్యాడు. ఏమైనా విసునూరులో తన అధికారాన్ని వాళ్ళు నిల్పకపోరని విశ్వసించాడు.

తన ఘోరదురంతాలన్నింటినీ నయానో, భయానో ప్రజలు మరచిపోకపోరని, తన అధికారాన్ని గుర్తించి 'నీ బాన్చనిదొరా, నీ కాల్మొక్తా!' అనకపోరనీ, ఆ విధంగా తన గౌరవాన్ని పునః ప్రతిష్ఠించుకోగలననీ విశ్వసించాడు. గౌరవంతో, అధికారంతో పైకి వచ్చిన తను చచ్చురోడీగా కాకుండా దేశముఖు అయి మీసాన్ని మెలివేయవచ్చునని అనుకున్నాడు. పూర్వపురోజుల్లోని ధనికుల దర్జాఅంతా కళ్ళకు కట్టినట్లయి ఒక్కసారి పెల్లుబికిపోయాడు.

కానీ, అతని కలలన్నీ అచిరకాలంలోనే కరిగిపోయినట్లు గ్రహించుకోగలిగాడు. ఇంతవరకూ తాత తాతలనుంచీ వస్తున్న టోపీ తప్ప వేరే కొత్త ఆస్తి ఏదీచేరలేదు, సంఘాన్ని అదిమిపెట్టి కలిగినంత ఆస్తిని సంపాదించుకోగలుగుతాననే ధైర్యము కూడా అతనికి సడలిపోయింది. కొంపలంటించి ఆ భీతావహంలో పారిపోతున్న ఆడవాళ్ళ రొమ్ముల్ని చీరి, నగలు అప

హరించేవాడు. రజాకార్లు పసిగట్టినా, దబాయించి లాక్కొనేవారు. పైగా 'ముక్కలకొడుకు ఇంత మింగుడు' కోసానికి ఏడుస్తున్నాడని, తిట్టేవారు. దానితో అతనికి అర్థమైపోయింది విసునూరుపై అతని అధికారం ఇంక మిథ్యయని. వారి మాటని తిరస్కరించినట్లయితే వారి చేతుల్లోనే బూడిదకాక తప్పదని గ్రహించాడు

హిందువులు కానీండి, ముస్లింలు కానీండి సామాన్యులంతా మస్తాన్ మాట వినేసరికి గడగడలాడేవారు. అతను కనుమరిగేసరికి మెటిమలు విరుచుకొంటూ శాపనార్థాలు పెట్టేవారు. ప్రజల ద్వేషాగ్నిలో శలభంలా మాడిపోతున్న అతని మనసుకు అతను చేసిన మానభంగాలు, దోచిన సొమ్ములూ, తాగిన రక్తం ఏవిధమైన ఆత్మశాంతినీ సంపాదించలేకపోయాయి.

* * *

ఒక్కసారి మంచులాంటి మౌనం పగిలింది.

"దానికేమి ? యల్లమంద చెప్పింది అక్షరాలా నిజమే." అన్నాడు వీరారెడ్డి. ప్రశాంతంగా స్థిమితంగా తన ఆలోచనల్లోంచి బయట పడ్డాడు వీరారెడ్డి. "మస్తానయ్య మన తెలంగాణా ప్రజలకందరికీ ద్రోహి. వాణ్ణి ఊరితీయాల్సిందే. మన ప్రజలంతా వాడి పాపఫలాన్ని చూసి సంతోషించేందుకు అనువైన స్థలంలో చెయ్యాలాపని. వాడి గుండెలమీద, వాడెందుకు ఉరి తీయబడ్డాడో తెలిపే అట్టముక్కకూడా ప్రేళ్లాడగట్టాలి - మిగతా వాళ్ళకుకూడా పాఠం చెప్తుంది - వాళ్ళని దయదలచి మనం విడిచినా అంతా సర్వనాశనమయ్యేదాకా వాళ్ళు మనల్ని విడిచేలా లేరు. ఇంక నాకూ, రామిరెడ్డికీ అనుమతివ్వండి. యల్లమంద కార్యభారాన్ని నెరవేరుస్తాం."

వీరారెడ్డి మాటలతో యల్లమందలో ఉత్సాహం మిగతావారి ముఖాల్లో చలనమూ కలిగాయి. మస్తాన్ ద్రోహిమీద వారికెట్లాంటి అసహ్యమున్నా ఈదృష్టికి వాళ్ళు రావటం ఇదే మొదలు.

'నువ్వు బాగానే సెప్పినవ్ బావా! దొంగనాకొడుకులకు శాస్తి సెయ్యాల్సిందే' అన్నాడు రామిరెడ్డి

'నువ్వు కాదు వీరారెడ్డి నేను చేస్తే చాలదా ?' అన్నాడు సుభాన్.

"సరిపోయింది, ఈ వంతుల్తో పొద్దు కుంకేటట్టుంది. ఇంకా దీనికెవళ్ళు సమర్థులో ఆలోచించండి. మందచేరటం మతానికి చేటని...—" అంది కమల.

"ఎందుకొచ్చిన బాతాఖానీ ఇది! ఒకటి మాత్రం సూడండి. వాణ్ణి పదిమందిలోనూ విచారించి మరే ఉరిదియ్యాలాయిరి !? అన్నాడు రామిరెడ్డి

"పోనీ మనమే చేద్దాం" అన్నాడు వీరారెడ్డి.

"ఏటి సూత్తారు! మీకు గ్యానం లేకపోతే సరి. నాను మాట తిన్నగా రాదుగాని, ఇంతమంది కూచున్నాం ఆడి సంగతులన్నీ చర్చించాం ఆడి విసుకు తిన్నవాడేగాని ఎవని వాడెవడూ లేడాయను ఊరి. మనం సబుబైన ప్రజా ప్రతినిధులం. కనుకే ప్రజల పేరున నిర్ణయించి ఉరితీద్దాం ఆ పని నాకు వదిలివేయండి" అన్నాడు సుభాను.

యల్లుమంద ఒక్క ఎగురెగిరి నేలమీద కర్రతో బాదాడు సంతోషంగా టుర్ ...” మంటూ.

* * *

ఎన్నో గృహ దహనాలలో, మాన భంగాలలో, అరెస్టులలో, తుపాకీ కాల్పులలో పాల్గొనడమే కాకుండా దేశముఖు జగన్నాథరెడ్డి భవనానికి కాపలా డ్యూటీ కూడా వహించేవాడు. ఆ భవనంలో క్రింద భాగం నిండా పోలీసులు. మేడ మీద రజాకార్లు, దొడ్లోను, వీధి అరుగుల మీదా గూండాలు కాపరం చేస్తున్నారు.

ఆ వేళ రాత్రి ఆ భవనాన్ని కాపలా కాస్తున్నాడు మస్తాన్. అడుగులు చప్పుడు చేసుకుంటూ భుజంమీద తుపాకీ త్రిప్పుతూ సెంట్రీలా నడుస్తున్నాడు మస్తాన్.

గాలి తరంగాలు ఆకుల్ని అల్లల్లాడిస్తున్నాయి. వాన కురుస్తోంది. తుంపర తుంపర్లుగా వాన పడుతోంది. ఆకాశం మేఘాలతో నిండి కారునల్లగా ఉంది. చందమామకాని, చుక్కలుకాని దూరంలేనంత చిక్కని రాత్రి. చెట్ల తలలుకూడా మరింత చిక్కని చీకట్లనుగూడ బెట్టుకుంటూ ఆ ఆకాశపు చీకట్లో లీనమయ్యేలా తమ శిఖరాలను విరజిమ్ముకొంటున్నాయి.

ఒక గొలుసుమీదనుంచి క్రమం తప్పకుండా నడుస్తోన్నట్టు వెనక్కు ముందుకీ కదులుతున్నాడు మస్తాన్ అప్పుడప్పుడు గేటు అంచుమీద అనుకొని ఏదో ఆలోచిస్తూన్నట్లో, ఏదో ఆశిస్తోన్నట్లో నించున్నాడు. గడీ కెదురు వీధిలోని చీకట్లోకి చూస్తూ మస్తాన్ అలా నిలచి ఉండగానే, వెనకనుంచి మంచి బలమైన పిడికిలి గడ్డ మీద గుద్ది కంఠాన్ని బిగపట్టింది. ఊపిరికూడా ఎగపీల్చలేక పోయాడు. మస్తాన్ - వెల్లకిలా పడగొట్టబడ్డాడు. నేలమీద మొదలు నరికిన వృక్షంలా పడేసరికి కొన్ని జతల చేతులు అతని కంఠాన్ని చేతుల్ని, కాళ్ళనీ నొక్కిపట్టాయి. ఎవరో ముక్కుపుటాలకు యినుప క్లిప్పు బిగించారు. తనంతటదే బలాత్కరించి తెరుచుకొన్న నోట్లో ఎవరో గుడ్డపీలికలు కుక్కి ముఖమంతా ఒక తువ్వాలుతో చుట్టబెట్టారు.

వాడికి తెలివి వచ్చేసరికి గ్రామంబయట గోతుల్లో తన కళేబరం వెల్లకిలా పడి ఉందని తెలిసింది కాళ్ళూ చేతులూ కట్టబడి వున్నాయి. పైన నల్లని ఆకాశం గోరీకట్టినట్లుంది.

తనకు రెండు వైపులా నీడలాంటి బొమ్మలు కదలాడుతున్నాయి ఆ వ్యక్తులెవరో అతనికి అస్పష్టంగా అనుతున్నారు. ప్రక్కచెట్టు కొమ్మమీదనుంచి వలంపాటి త్రాడొకటి వ్రేలాడుతూ కన్పించింది “చక్కగా జారుముడి వేయి” అంటున్నారెవరో.

తన మృత్యుదేవత పరిహసించినట్లుయింది. వారి అట్టహాసం చూచి తనలో తనే నవ్వుకున్నాడు. తన కత్తికెప్పుడూ ఇంత ఆలోచనలేదు. తాను నిరాయుధులైన ఏడుగురు గొరిల్లాలను వరుసగా నిలబెట్టి కత్తివేటుతో తలలు నేలకురాల్చాడు. తనను అడ్డుకొన్న ఆడదాన్ని తనివితీరా అనుభవించి రెండుకాళ్ళను సాగదీసి రెండుచెక్కలుగా నరికివేశాడు.

(మిగతా 55వ పేజీలో)

ఫెళ ఫెళ ఫెళ ఫెళ్ళుమని
తూలి నేల కూలుతోంది
వెలుగుతోంది తెలుగు వెలుగు
దిగంతాల ధగధగమని
నల్లగొండ బల్లిదము
ఓరుగంటి వీరత్వం
కరీంనగర్ గట్టిపట్టు
ఆదిలాబాద్ అజేయశక్తి
మెతుకుసీమ మేరుధృతి
కారడవుల కాల్చివేసి
భస్మీ పటలం చేసి
ప్రజాప్రభుత్వానికొరకై
బాట బాగుచేస్తున్నవి
బాధితులు బీదప్రజలు
రైతులు కూలీలే తము
రాజ్య స్థాపన జేసుక
తరుగులేని సంపదలతో
కరువు దరిద్రాలు లేని
వ్యాధులు బాధలు లేని
భూతలస్వర్గం నిర్మిస్తారు!

---

(53 వ పేజీ తరువాయి)

దొర్లుకొంటూ పారిపోవాలని కూడా మస్తాన్ ప్రయత్నించాడు; కాని ఒక్క తన్నుతో తనని సరియైన ప్రదేశానికి మార్చాడు ఎవరో.

ఇట్లా అస్పష్టమైన ఈ వ్యక్తుల్ని గుర్తుపట్టాలని మస్తాన్ ప్రయత్నించాడు. తాను ఊపిరిబిగబట్టగలిగి బ్రతికి బయటపడగలిగినా, లేక ఎవరైనా తనవాళ్ళు ఆ ప్రాంతాలకు చూడవచ్చినా ఈ హంతకుల జీవితాల్ని పీల్చివేయవచ్చునని అతని ఆశ.

సుభాన్!... తనను ఉరి తీయటానికి పూనుకొన్నది సుభానా?... కమలా! ఇది కూడానా? 'మన సెక్క ఏడుస్తుంది'! అనుకున్నాడు.

'రెడ్ రిపబ్లిక్ ప్రజలు అర్పించిన రక్తాశ్రువులకు తర్పణంగా......" కమలమ్మ తియ్యగా నివేదించింది.

మస్తాన్ భయంతో గిలగిలా కొట్టుకొంటున్నాడు ఉరిత్రాడు క్రిందికి జారింది. ఎన్నో బలీయమైన హస్తాలు త్రాటిని అతని కంఠానికి బిగించి కళేబరాన్ని పైకి లాగాయి. భూమికి రెండడుగుల ఎత్తులో అతని శరీరం వ్రేలాడుతోంది. కాసేపు గిలగిలా కొట్టుకొని ఆగిపోయాయి అతని చేతులూ... కాళ్ళూ.

దూరంగా గడిలో మంటలు చెలరేగాయి. నాలుగు దిక్కులనుంచిమంటలు చుట్టుముట్టుతున్నాయి. లోపలనుంచీ, పైనుంచీ తుపాకి కాల్పులు దిక్కులు పిక్కటిల్ల జేస్తున్నాయి. అగ్నిలోంచి దూకి పరుగిడబోయే రాక్షసులందరూ గొరిల్లా తుపాకులకు నేలకొరుగుతున్నారు.

తెల్లవారేసరికి పోలీసుల, గూండాల, రజాకార్ల దుమ్ము మిగిలింది. జనం తండోపతండాలుగా మస్తాన్ శవాన్ని చూస్తూ, వాడి మొఖంమీద ఉమ్మేస్తూ, వాడిపీడ వదిలించిన దేవతల్ని స్మరించుకొంటున్నారు.